ఉత్సాహంగా తిరంగా ర్యాలీ


నింబోలిఅడ్డలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంతో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం నింబోలి అడ్డాలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీలకతీతంగా యువత, పిల్లలు, మహిళలు జాతీయ పతాకాన్ని చేతబూని నినాదాలు చేశారు. డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి. జి.అమృతారెడ్డి, ఘన సంతోషిణి రెడ్డి, ఎల్.అన్విత్ పటేల్ పాల్గొన్నారు.

22న హనుమ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు



నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ఈ నెల 22న హనుమ జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో కె. జయంతి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు స్వామివారికి విశేష అభిషేకం ఉంటుందన్నారు. 9 గంటలకు తమలపాకులతో సహస్ర నామార్చనలు, వడమాల పూజలు, హారతులు ఉంటాయని చెప్పారు.

ఆసుపత్రి భవనం సీజ్



ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన డాక్టర్ శంకర్ ప్రజా ఆసుపత్రి భవనాన్ని ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ సీజ్ చేశారు. ఆసుపత్రి భవనంలో అదనంగా సెల్లార్‌తో పాటు మరో రెండు అంతస్తులు నిర్మించారని తెలిపారు. కోర్టు ఆదేశాల మేర అయిదు, ఆరు అంతస్తులు, సెల్లార్‌ను సీజ్ చేశామన్నారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, జీహెచ్ఎంసీ సిబ్బంది ఉన్నారు.

తిరంగా యాత్రకు తరలిన బీజేపీ శ్రేణులు



నల్లకుంట: భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి తిరంగా యాత్రను చేపట్టారు. ఈ యాత్రలో నల్లకుంట కార్పొరేటర్ అమృత, నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్, శబరిమల అయ్యప్ప సేవా సమాజం జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి తదితరులు తరలి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ మైనార్టీ అధ్యక్షుడిగా హఫీజ్

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ మైనార్టీ అధ్యక్షుడిగా ఎండీ హఫీజ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని శనివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. అనంతరం హఫీజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ యాదవ్ పాల్గొన్నారు.

ఓయూలో సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ధర్మనిధిపై సదస్సు జరిగింది. శనివారం ఓయూ బీసీ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని సెమినార హాలులో జరిగిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా మాజీ వీసీ ప్రొ.గోపి ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వీరబ్రహ్మేంద్ర స్వామి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొ.గౌరీశంకర్, ప్రొ.వెంకట రాజయ్య, అద్దూరి రవీంద్రచారి పాల్గొని ప్రసంగించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

- ఇబ్బందుల్లో ప్రజలు, ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు




అంబర్‌పేట డివిజన్‌లో అధ్వాన్నంగా మ్యాన్‌హోల్

అంబర్‌పేట: మ్యాన్‌హోళ్లు అధ్వాన్నంగా మారాయి. శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట డివిజన్‌లోని గల్లీలో మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. పటేల్‌నగర్, నరేంద్రనగర్, చెన్నారెడ్డినగర్, ప్రేమ్‌నగర్, న్యూ పటేల్‌నగర్, ఆజాద్‌నగర్ ప్రాంతాల్లోని దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయందోళనకు గురవుతున్నారు. రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన జలమండలి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోళ్లు దెబ్బతింటే డ్రైనేజి వ్యవస్థస్తంభించి పోతుందని పలువురు వాపోతున్నారు. దీనిపై జలమండలి డీజీఎం విష్ణువర్ధన్ రావును సంప్రదించేందుకు ప్రయత్నించగా అతను అందుబాటులోకి రాలేదు.

అధికారులు పట్టించుకోవడం లేదు

డ్రైనేజీ, ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోళ్లపై ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. అంబర్‌పేట డివిజన్‌లో ఏ గల్లీకి వెళ్లినా అధ్వాన్న మ్యాన్‌హోళ్లు దర్శనమిస్తున్నాయి. దీనిపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదు. ప్రజలకు ఏం జవాబు చెప్పాలో అర్థం కావడం లేదు. కాంట్రాక్టర్ పేరు చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు.

– కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

రూ.1.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్


భోలక్‌పూర్‌లో రోడ్డు సమస్యలను అధికారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో మొదటి విడత రూ.1.50 కోట్లతో అద్వానంగా మారిన రోడ్లను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో రంగానగర్, బొంతల బస్తీ, బంగ్లాదేశ్ మార్కెట్, గుల్షన్ నగదర్, పహాడి మసీద్ వీధి తదితర ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, జలమండలి సెక్షన్ మేనేజర్ శ్రీధర్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట విడత రోడ్డు పనులు పూర్తి అయిన వెంటనే మరో రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న రోడ్లను సైతం పూర్తి చేస్తామన్నారు. బొంత బస్తీలో అద్వానంగా మారిన డ్రైనేజీ పైపలైన్‌లను తొలగించి కొత్తవి వేస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలుతనకు పింఛన్ రావడం లేదని ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సూచించారు. శనివారం గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో సీవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఛత్రపతి శివాజీ బాయ్స్ టీమ్‌కు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుఢ్యానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, ఇండియన్ మాజీ క్రికెటర్ వెంకటప్రతాప్ పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి కన్వీనర్‌గా మనోజ్‌గౌడ్



ముషీరాబాద్: తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య హైదరాబాద్ కన్వీనర్‌గా రాంనగర్‌కు చెందిన పరకాల మనోజ్‌గౌడ్‌ను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించారు. తెలంగాణ జాగృతి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కవితకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీమాలిక గ్రంథం ఆవిష్కరణ


శ్రీమాలిక గ్రంథం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణిదేవి

చిక్కడపల్లి: రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన శ్రీ మాలిక గ్రంథం అపురూపం అని శాసన మండలి సభ్యురాలు సురభి వాణిదేవి అన్నారు. శ్రీమాలిక గ్రంథం 16వ ముద్రణ త్యాగరాయ గాన సభలో శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ పాఠకులు తక్కువగా వున్న నేటికాలంలో ఆధ్యాత్మికగ్రంథం పదహారు ముద్రణలు పొందటం విశేషం అని అన్నారు. గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి, పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్, గీతాదేవిలు పాల్గొన్నారు.

బీసీలకు అవకాశం ఇవ్వరా..?

కాచిగూడ: రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ పదవుల్లో బీసీలకు అవకాశం ఇవ్వరా..? అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తూ లేఖ రాశారు. జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలు ఆర్టీఐకి కమిషనర్ పోస్టులకు అర్హులు కారా? అని ప్రశ్నించారు.కేవలం ఒకే కులానికి సీఎం కొమ్ము కాస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంత అన్యాయమా.. బీసీ ఏజెండా ఏమైందని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. మిగిలిన 3 కమిషనర్ల పదవులను బీసీలకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

కాచిగూడ: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిత ఉన్నతంగా ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్, పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాచిగూడలో మాట్లాడుతూ... మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతకు, విద్యార్థులకు పొగాకు నియంత్రణపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసలు కావద్దని ఆయన సూచించారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు


యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్: అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయవద్దని సకాలంలో వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలో రక్తపోటుపై అవగాహన శిబిరం, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ మాట్లాడుతూ రక్తపోటు లక్షణాలు తరుచుగా తలనొప్పిరావడం, చూపు మందగించడం, ముక్కు నుంచి రక్తం కారడం, నీరసంగా ఉంటారని సూచించారు.

బడీ మసీదును పరిరక్షించాలి


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ హోహినొద్దీన్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో 400ల సంవత్సరాల చరిత్ర కలిగిన చారిత్రాత్మక కట్టడం బడీ మసీదును పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ సయ్యద్ హోహినొద్దీన్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నగరంలో చార్మినార్ నిర్మించిన సమయంలో భోలక్‌పూర్‌లో బడీ మసీదును నిర్మించారని తెలిపారు. మసీదు మినార్‌లు పెచ్చులూడి అందకారంగా మారుతున్నదని ఫిర్యాదు చేశారు.

సరస్వతి మాత శేష వస్త్రాలు వేలం



నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో శనివారం సరస్వతి మాత శేష వస్త్రాలు(చీరలు) వేలం వేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున వేలంలో పాల్గొని అమ్మవారి శేష వస్త్రాలను కొనుగోలు చేశారు.ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించి, అనంతరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారిణి(ఈవో) కె. జయంతి, ఆలయ అర్చక స్వామి అప్పారావు, ధర్మకర్తలు మధుసూదన్ సమక్షంలో నిర్వహించారు. వేలం ఆదివారం, సోమవారం కూడా కొనసాగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

సందడిగా మూలం సంత

లాలాపేట: గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తార్నాక మర్రి కృష్ణాహాల్లో నిర్వహించిన 11వ మూలం సంతకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. దాదాపు 100 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయ, గోఆధారిత, చేతివృత్తుల వస్తువులను కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులతో మూలం సంతలో సందడి నెలకొంది. ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ డాక్టర్. పి. వి రావు, దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణులు బసంపల్లి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో సంరక్షణ, ప్రకృతి, పాడి, సాహిత్యం, కుల వృత్తులను, చేతి వృత్తులను ప్రోత్సహించడానికి గ్రామభారతి చేస్తున్న కృషిని అభినందించారు.


వినియోగదారులతో కిటకిటలాడుతున్న మూలం సంత

గద్దర్ ఫిలిం అవార్డులను తెలంగాణ సినిమాలకే ఇవ్వాలి

చిక్కడపల్లి: గద్దర్ ఫిలిం అవార్డును తెలంగాణ సినిమాలకే ఇవ్వాలని తెలంగాణ సినిమా వేదిక (టీసీవీ) రాష్ట్ర గౌరవ సలహాదారు ప్రపుల్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లిలో టీసీవీ రాష్ట్ర కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ బైరాగిలతో కలసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడుస్తున్నా సినీరంగంపై ఆంధ్రావారి పెత్తనం కొనసాగుతుందని ఆరోపించారు. పేరుకే తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఉన్నా ఆంధ్రావారికే అవార్డులను అందజేయడం సరికాదన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యం

రాంగోపాల్‌పేట్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైంది. గోపాలపురం పోలీసులు తెలిపిన మేరకు.. ఆదిబట్లకు చెందిన వెంకటేశ్వరమ్మ (65)కు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా ఉండదు. ఆదిబట్లలో ఆమె ఒక్కరే నివాసం ఉంటోంది. ఆమెను మరిది కృష్ణారెడ్డి అశోక్‌నగర్‌కు తీసుకెళ్లేందుకు బస్సులో రెతిఫైల్ బస్టాండుకు చేరుకున్నాడు. బస్సులో కూర్చోబెట్టి మెడికల్ షాపునకు వెళ్లి వచ్చే లోపు ఆమె కనిపించలేదు. దీంతో శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.